# పెనాల్టీ కార్నర్

సురేంద్ర ఏడుస్తున్నాడు.

ఊహ వచ్చేక అతను ఏడ్వటం అదే మొదటిసారి. హాకీస్టిక్ తగిలిన బంతిలాగ అతను విలవిల్లాడిపోతున్నాడు. గోల్లోకి వెళ్లిపోతానేమోనని భయపడుతున్న బంతిలాగ అతను గజగజ వణికిపోతున్నాడు.

సురేంద్ర స్వప్నకేసి చూశాడు. ఆమె తనకేమీ పట్టనట్టు ఇంగ్లీషు డిటెక్టివ్ నవల చదువుకుంటోంది.

"స్వప్నా!" అతని పిలుపులో జాలుంది.

"ఏమిటి?" పుస్తకంలోంచి ముఖం తిప్పకుండానే అడిగిందామె.

"నీ నిర్ణయం మారదా?" అతని కంఠంలో అసహాయత ధ్వనించింది. "సమస్య మారనప్పుడు, నిర్ణయాలూ మారవుకదా?" కఠినంగా అంది.

"నా పరువు విషయం ఆలోచించావా?"

"నీ పరువుకన్నా ముఖ్యమైన సమస్య నాది."

అతనికి తాగాలనిపిస్తోంది. తల గోడకేసి కొట్టుకోవాలనిపిస్తోంది. చచ్చిపోవాలనిపిస్తోంది. ఏం చేసినా ఈ సమస్యకు పరిష్కారం దొరకదు.

అతనికి సరస్వతి గుర్తుకొచ్చింది. మనస్సు అర్ద్రంగా అయిపోయింది. ఆమె ఉంటే తనని గుండెల్లో దాచుకుని ఓదార్చేది. లాలించేది. బుజ్జగించేది. ఆమెకు తను చేసిన అన్యాయమే తననిలా కాలుస్తోంది.

"సరస్వతీ! నన్ను శపించావా!" మనస్సులో అనుకున్నాడు. అతని మనస్సు ఏడాది వెనక్కి వెళ్లింది.

ఆరోజు శోకవదనంతో సరస్వతి....ఫొటో ఆల్బమ్‌లో స్వప్న అందాన్ని చూసుకుంటూ తను.

"ఏమండీ! నాకీ శిక్ష విధించకండి. నేను భరించలేను."

కాళ్ళావేళ్ళావడి ఏడ్చింది. బాధపడింది. బతిమలాడింది.

చివరికి సరస్వతి కున్న ఒకే ఒక్క వీక్‌నెస్....ఆమె ఫౌల్ చేసింది....తనే పెనాల్టీ కార్నర్ తీసుకుని గోల్ చేశాడు. ఆమె హాకీ బంతిలాగ దొర్లుకుంటూ గోల్లో పడిపోయింది.

అప్పటి తన ఆనందం....?

ఎవరెస్టు ఎక్కిన టెన్సింగ్‌లాగ....

* * *

'పెనాల్టీకార్నర్ ఇచ్చారా?'

"సురేంద్ర ఈజ్ దిజైంట్ కిల్లర్—హి విల్ డు ఇట్"

"సురేందర్....పులప్ యువర్ సాక్స్...."

ఒకటి రెండు మూడు....

మూడే క్షణాలు— అనుకున్నదంతా జరిగిపోయింది.

సురేంద్ర గోల్ చేశాడు.

ఆ వాతావరణమంతా అల్లకల్లోలం....అరుపులు, బొబ్బలు, కేకలు.

ఆడపిల్లలు సైతం ఎగిరి గంతులేస్తున్నారు.

'హి డి డిట్' — స్వప్న అరుస్తోంది. కేకలు పెడుతోంది. కేరింతాలు కొడుతోంది. పక్కనున్న స్నేహితురాలి వీపుమీద చరుస్తోంది

ఒకటికాదు, రెండుకాదు....వరుసగా నాల్గు. వచ్చిన ప్రతీ పెనాల్టీ కార్నర్ని సురేంద్ర గోల్ కింద మార్చాడు.

నాలుగు గోల్స్ చేశాడు.

హాకీ ఆట పూర్తయ్యింది. సురేంద్ర టీం నెగ్గింది. చుట్టూ జనం, అభినందనలు, కౌగిలింతలు. ఇసకవేస్తే రాలనంత జనం. ఎల్లాగో పెవిలియన్‌లోకి వెళ్లి డ్రెస్ మార్చుకుని బైట పడ్డాడు.

అప్పుడు అక్కడ జరిగిన సంఘటనకి అతనేకాదు— అందరూ ఆశ్చర్యపోయారు. ఇరవైనాలేళ్ల అమ్మాయి—బెల్‌బాటమ్స్ వేసుకుని, గాగుల్స్ పెట్టుకుని, అల్ట్రామాడ్రన్‌గా—గొప్పింటి బిడ్డని చూడగానే చెప్పొచ్చు....పరుగెత్తికెళ్లి సురేంద్రను కౌగలించుకుంది. అతని చెక్కిలి మీద వరుసగా నాల్గు ముద్దులు పెట్టుకుంది సురేంద్ర స్పృహలోకొచ్చే సరికి ఐదు నిమిషాలు పట్టింది. పుష్టిగా ఆరోగ్యంగా ఉన్న ఆమెకేసే చూస్తున్నాడు.

"ఐయాం స్వప్నా!" తనే పరిచయం చేసుకుంది.

"హల్లో!" ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ అన్నాడు.

అలా జరిగిన పరిచయం....

మర్నాడు స్వప్న ఇంట్లో సురేంద్ర గౌరవార్థం....డ్రింక్‌పార్టీ, డిన్నర్....

ఆమె తండ్రి రోజూ నాల్గుకార్లుకొని, ఐదు అమ్మేస్తాడు. ఆయన కది హాబీలేదు. వృత్తి. హైద్రాబాద్‌లో మంచి సెంటర్లో రెండు మేడ లున్నాయి, ఒక భార్య, ఒక కూతురు, నాల్గులక్షలు ఆయన చరాస్తులు.

స్వప్న బి. ఏ. పాసైంది. తర్వాత ఆమెకు చదువు 'బోర్' కొట్టింది. ఇంగ్లీషు నవలలు చదవడం, ఇంగ్లీషు సినిమాలు చూడటం, ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చెయ్యడం ఆమె దిన చర్య. హాకీ ఆటంటే ఆమెకు ప్రాణం. ఆమంటే వాళ్ళనాన్నకు ప్రాణం. స్వప్న రేపు ఏం కోరుకుంటుందో ఆయన కీవేళ తెలుస్తుంది. అదాయన సాయంత్రమే కొని తెస్తాడు.

ఆమెకు హాకీ ఆటంటే క్రేజ్....ఇప్పుడు సురేంద్రంటే క్రేజ్.... రోజూ వాళ్లిద్దరూ సాయంత్రాలు కలుస్తుంటారు. అతను హాకీ ఆడటానికి హైద్రాబాద్ వదిలివెడితే ఆమెకూడా వెడుతుంది. అతన్ని చూడకుండా ఆమె 'ఒక్కరోజు కూడా' బతకలేదు. ఆమె గదిలో మంచంమీంచి లేవగానే ఎదురుగ గోడమీద సురేంద్ర ఫొటో కనబడుతుంది. సురేంద్ర తల్లి దండ్రులకు ఒక్కడే కొడుకు. ఆయన మిగిల్చివెళ్లిన ఏభై ఎకరాల

మాగాణీపొలం గోదావరి జిల్లాలో క్షేమంగా వుంది అతను కాలేజీ రోజుల్నుంచి హాకీ ఆడుతున్నాడు, ఎన్నోసార్లు కాలేజీ తరఫున, యూనివర్శిటీ తరఫున హాకీ ఆడాడు. తన ఎదుటి పక్షంలో వాడెవడైనా ఫౌల్‌చేసి, తన టీంకి పెనాల్టీ కార్నర్ ఇవ్వడం జరిగితే—సురేంద్ర పంట పండిందన్న మాటే. ఒక్క-క్షణంలో పెనాల్టీ కార్నర్ గోల్‌గా మార్చగలడు. అందులో అతని నైపుణ్యం అద్వితీయం. అతని హాకిఆట చూసే అతనికి బాంక్‌లో ఉద్యోగం ఇచ్చారు. అప్పట్నుంచి అతను హైద్రాబాద్‌లో ఉంటున్నాడు.

అతని తండ్రి పోయినప్పుడు ఆయన దాయాదులు ఆస్తి కాజెయ్యాలని ప్రయత్నిస్తే, వాళ్ల చదువురానితనాన్ని ఫౌల్‌గా తీసుకుని డబ్బుగుప్పించి—పెనాల్టీ కార్నర్ తీసుకుని వాళ్లందర్నీ గోల్లోకి కొట్టాడు.

ఇలా ఒకటికాదు — రెండుకాదు, అతనికి జీవితం హాకీఆటలాంటిది. జీవితంలోకూడా అతను తల్చుకున్నప్పుడల్లా గోల్స్ కొట్టగలడు కాకపోతే ఎవరైనా ఫౌల్ చెయ్యాలి." అంతే.

ఇప్పుడతనికి ఎదురైన సమస్య సరస్వతి.

ఆమె జీవితంలో ఫౌల్ చెయ్యలేదు. చెయ్యదు. ఆమెను బంతిని కొట్టినట్టు గోల్లోకి కొట్టాలి. అదంత సులభంకాదు. అతని తల్లి మంచి గోల్‌కీపర్. పడనివ్వదు. ఆమెకు కోడలంటే మహాఇష్టం.

సరస్వతి సురేంద్ర భార్య—అతని చదువు పూర్తికాగానే తల్లి మేనకోడలు సరస్వతిని పైసా కట్నంలేకుండా ఉభయ ఖర్చులు భరించి, అతనికి పెళ్లి చేసింది. సురేంద్ర, సరస్వతి చాలా అన్యోన్యంగా వుంటారు.

వాళ్లకి వరుసగా ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. మూడు పురుళ్లకీ సరస్వతికి అపరేషన్‌చేసి పిల్లల్ని బైటకి తీయాల్సొచ్చింది. మూడోబిడ్డ పుట్టాక—"ఇంకోసారి ఈమె గర్భవతి అయితే బతకదు" అని డాక్టర్లు ఖచ్చితంగా చెప్పేసారు.

"భలేవారే— కొడుకు పుడతాడన్న ఆశతో మూడోసారికూడా చూశాడు. కొడుకు లేకపోయినా ఫరవాలేదు. ఆమెకు ఆపరేషన్ చేసెయ్యండి. ఆమె నా దేవత. ఆమె లేకుండా నాకీ ఆస్తి ఎందుకు? ఆట ఎందుకు? పిల్లలెందుకు?—ఆమె నా ఇంటి మహాలక్ష్మి. ఆమె లేకపోతే నాకీ బతుకేలేదు" అని కంట తడిపెట్టుకున్నాడు సురేంద్ర. ఆమెకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసేసారు.

అది జరిగాక రెండేళ్ళు బాగానే గడిచాయి. అప్పుడే స్వప్న అతని జీవితంలో ప్రవేశించింది. వాళ్ల పరిచయం బాలచంద్రుడిలా వృద్ధి పొందుతూ పున్నమిదాకా ఎదిగింది.

అవును— ఆరోజు నిజంగానే పున్నమి. కాని సరస్వతికి మాత్రం అది అమావాస్య చీకటి.

"నేను స్వప్నని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను." ఎదురుగా తమలపాకులుకి సున్నం రాస్తున్న సరస్వతికి తను కూర్చున్న సోఫా భూమిలోకి కుంగిపోతున్నట్లనిపించింది. మరో సోఫాలో కూర్చుని భాగవతం చదువుకుంటున్న అతని తల్లికి భాగవతం కాలిపోతున్నట్టనిపించిది.

ముగ్గు రాడపిల్లలు పీడకలలు కన్నారు.

"ఏం మాటాడుతున్నావో తెలిసే మాటాడుతున్నావా?" తల్లి తీవ్రంగా అంది.

"చాలా ఆలోచించే మాటాడుతున్నాను. స్వప్న నేను లేకుండా బతకలేదుట. వాళ్ల నాన్నగార్నికూడా ఒప్పించింది.

తల్లికి అంతర్కితమే అలాంటి అనుమానం కల్గింది.

కొడుకుమీదున్న నమ్మకంతో ఏమీ అనలేదు. అతనంతట అతనే అన్నాక ఆమెకు మెదడు పన్జేయడం మానేసింది....

'ఈ కొంపకు ఏదో శని పట్టింది. లేకపోతే వీడి కిలాంటి పిదప కాలపు బుద్ధులు పుట్టవ్' అని మనస్సులో అనుకుంది.

"నీకు జీవితంలో ఏం తక్కువైందిరా?" తల్లి అడిగింది.

"స్వప్న తక్కువైంది."

సురేంద్ర సరస్వతికేసి చూశాడు. ఆమె అక్కడ లేదు.

ముగ్గురూ స్వప్నగురించే ఆలోచిస్తున్నారు.

సురేంద్ర కామె తనకోసం భువికి దిగిన వీనస్‌లా వుంది.

సరస్వతి కామె తన జీవితంలో ప్రవేశిస్తున్న నల్లని చీకటిలా వుంది.

తల్లి కామె తమ ఇంట్లో ప్రవేశిస్తున్న రాక్షసిలా అనిపించింది.

ఆమె ఏంమాట్లాడలేదు. పది నిముషాలు పోయాక సురేంద్ర మేడమీద తనగదిలోకి వెళ్ళాడు. సరస్వతి ఘొల్లుమని ఏడుస్తుంది. సురేంద్రరాక గమనించి "ఏమండీ! మీకు నే నేం అన్యాయం చేసానండి. నేనేం తప్పుచేశానని నా కింత శిక్ష విధిస్తున్నారు."

ఏడుపుతో ఆమె గుండెలు పగిలిపోయేటట్టున్నాయి.

"నిన్నొదిలేస్తానని అనడంలేదుగా— నీకేం లోటు జరగనివ్వను. కాని స్వప్నను చేసుకుంటాను. ఆమెకు మాటకూడా ఇచ్చాను."

సరస్వతి ఇంకా ఇంకా ఏడ్చింది.

తన ప్రారబ్ధాన్ని త.నే తిట్టుకుంది. భర్త మొండిమనిషని ఆమెకు తెలుసు.

ఆమెకు భవిష్యత్తు రాక్షసిలా కనబడుతోంది.

భయపెడుతోంది.

మనిషి ఎప్పుడు ఎందుకు ఎవరివల్ల ఎలా మారతాడో తెలియదు— మంచికీ చెడుకి కూడా మారటం మనిషి నైజం. ఈనాడు భార్యను విపరీతంగా ప్రేమించే నువ్వు నాల్గేళ్ళ తర్వాత నీ ఆఫీసులో పనిచేసే మగరాయుడిలాంటి అమ్మాయిని (ఆమెవయస్సు నలభై దాటి ఉండవచ్చు) అభిమానించడం మొదలెడతావ్. అప్పటి కామె నీలాటి 'బోయ్‌ఫ్రెండ్స్' ముగ్గుర్ని మార్చిందన్న విషయం తెల్సిండీ తెలియనట్టు నటిస్తావ్. ఆమె నీకు దేవతలా కనబడుతుంది. ఆమెకు, నీకు చెడ్డ సంబంధం లేకపోవచ్చు. ఆ మగరాయుడే నీకు వందకిరణాల జ్యోతిలా కనబడుతుంది. ఆమె పచ్చగడ్డితో ఫలహారంచేసి పెడితే అది నీకు అమృతంలా కనబడుతుంది.

అంతవరకు ఆమ్లెట్ వాసన కూడా భరించలేని నువ్వు మగరాయుడిచేత్తో చేసిపెట్టిందని పందిమాంసం కూడ తింటావ్ (సీమపంది దేకదా అని సమాధానం చెప్పుకుంటావ్). అంతవరకు రతీదేవిలా కనబడిన నీ భార్య నీ కళ్ల ముందు ఫేడౌట్ అవుతుంది. ఆమె నీకు అప్పలమ్మల్లా కేవలం అంట్లు తోమే అప్పలమ్మల్లా కనబడుతుంది. ఆమె చేసిన కూరలునచ్చవ్. అందులో ఉప్పు, కారం ఎక్కువయ్యాయంటావ్. భార్యతోసహా ఎవ రేంచెప్పినా మగరాయుడిమీద నీ అభిప్రాయం ఏ మాత్రం మారదు. నీ పిల్లలసంగతి నువ్వు పట్టించుకోవ్. అది పూర్తిగా భార్య బాధ్యత అయినట్టు మాటాడతావ్. మగరాయుడి ఇంట్లో కూరలయి పోయాయంటే బాధపడిపోతావ్. సైకిలేసుకుని వెళ్ళి ఇచ్చేసొస్తావ్. పిల్లాడికి జ్వరంగా ఉందన్నా మందు తెచ్చి వెయ్యాలన్న జ్ఞానం నీ కుండదు.

తనకివ్వని ప్రాధాన్యత మరెవరికో ఇస్తున్నందుకు నీ భార్యకు నీ మీద కోపం వస్తుంది. అది సహజం. ఆమెకు నీమీద అనుమాన మంటావ్....నువ్వు మరీ పొగుడుతుంటే మగరాయుడిలోని లోపాల్ని ఎత్తిచూపుతుంది. నీ భార్య.... ఆమె గురించి హేళనగా మాటాడుతుంది. అది భరించలేని నువ్వు భార్యను అసహ్యించుకోవడం మొదలెడతావ్. ఆమెను తిడతావ్. కొడతావ్. జుట్టు పీక్కుంటావ్. లేకపోతే తాగెయ్యడం మొదలెడతావ్. 'నీవల్లే నేను తాగు బోతునయ్యానని భార్యతో అంటావ్'

ఇదంతా ఓరకమైన కోమా, హితులు స్నేహితులు, తల్లి, తండ్రి చెప్పిన సలహాలు నీ తలకెక్కవ్. రహస్యంగా మగ రాయుణ్ణి ఆరాధిస్తూనే ఉంటావ్. రహస్యంగా ఆమెను కలుస్తూనే వుంటావ్. సలహా చెప్పిన ప్రతివాడు నీకు శత్రువవుతాడు. నువు జీవితంలో నరకం అంచుల్ని చూడటమేకాదు....నీ భార్యక్కూడా చూపిస్తావ్. గిల్టీ కాంషస్‌నెస్ నిన్ను అనుక్షణం దహిస్తూ వుంటుంది.

ఈ కోమాలోంచి బైటపడటానికి నీ చదువు, వయస్సు, విజ్ఞానం ఉపయోగపడవ్. ఎప్పుడో ఆమెవల్లె ఓ మొట్టికాయ తిని, బొప్పికట్టి కోమాలోంచి బైటపడతావ్. కానీ, యీలోగా యెంత మంచి కాలాన్ని నరకప్రాయం చేసుకున్నావ్? ఎంత జీవితాన్ని కావాలని ముళ్లలో నింపు కున్నావ్?—ఎంత వ్యథా? ఎంత వేదనా?....

[మార్పు మంచికోసమైతే ఈ చర్చ అనవసరం —రచయిత]

అల్లాంటి కోమాలో పడ్డాడు సురేంద్ర— కాని, నీకు అతనికి ఒకటేతేడా— స్వప్నను అతను పెళ్ళిచేసుకుని ఇంటికి తీసుకొస్తున్నాడు. నువ్వు మానసిక వ్యభిచారం చేస్తున్నావ్???

వారంరోజులపాటు ఆ ఇంట్లో ఏడుపులు, కేకలు, ఆక్రందలు, ఘర్షణలు....ముగ్గుర్లో ఎవరూ ఏపూట అన్నం తినలేదు. కంటినిండా నిద్రపోలేదు.

పిల్లలికి ఇంట్లో జరుగుతున్నది ఏం తెలియడంలేదు. ఇంట్లో యెవరూ మూడ్స్‌లో లేరని మాత్రం తెలుసు.

ఆ రాత్రి సరస్వతి మళ్లీ భర్తని బ్రతిమలాడింది. ఏడ్చింది. వేడుకుంది. సురేంద్ర ఆల్బమ్‌లో తనూ, స్వప్న కల్సి తీయించుకున్న ఫొటో కేసి చూస్తున్నాడు.

"ఏమండీ! జీవితంలో ఏదైనా చెయ్యగలనండి. మిమ్మల్ని మాత్రం మరొకరితో పంచుకోలేను."

ఆమెకు ఏడ్చేందుకూడా ఓపిక లేదు.

ఆల్బం పక్కన పెట్టి వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు.

"చూడు సరూ! నీకు అన్యాయం చెయ్యాలని కాని, స్వప్నమీద మోజు కొద్దీకాని— నేనీ పని చెయ్యడం లేదు. ఎన్నాళ్ళనుంచో నీకీ విషయం చెప్పాలని, నువ్వు బాధపడతావని ఊరుకున్నాను. నాకు కొడుకు కావాలి."

సరస్వతి దిమ్మెర పోయింది.

"నిజం సరూ! నాకు కొడుకు కావాలి. నా వంశం, పరువు, ప్రతిష్ట నిలబెట్టేవాడు. ఈ ఆస్తికి వారసుడు ఒక్క కొడుకు కావాలి. నీకు తెలుసు. నువ్వు మళ్లీ తల్లివి కాలేవు. అందుకే స్వప్నను చేసుకుంటున్నాను. నీకేంలోటు చెయ్యను. ఈ ఇంటిమీద, ఆస్తి మీద పెత్తనం నీదే."

"మీ మనస్సుమీద లేని పెత్తనం ఆస్తిమీద, ఇంటిమీద ఎందుకు?" అందామనుకుంది సరస్వతి— అనలేదు— అనవసర మనిపించింది.

ఒకటి....రెండు....మూడు-మూడే క్షణాలు. సరస్వతిలో లోపాన్ని ఎత్తిచూపి, చెయ్యని ఫౌల్ చేసినట్టు ఋజువు పర్చి సురేంద్ర గోల్ చేశాడు.

సరస్వతి గోల్లో పడిపోయింది.

అతని తల్లికున్న గోల్ కీపర్ చాకచక్యం పనికిరాలేదు.

మరోవారం తర్వాత సురేంద్ర స్వప్నం నిజమై స్వప్న అతని భార్యగా కాపురానికొచ్చింది. సరస్వతి ఉత్సాహం, ఆనందం మరిచి పోయింది. అత్తగార్కి సేవలు చెయ్యడం, పిల్లల్ని చూసుకోడం ఆమె దినచర్య.

* * *

ఓ ఏడాది బాగానే సాగిపోయింది.

సరస్వతి పిల్లల్ని తీసుకుని పుట్టింటి కెళ్ళింది.

అది సురేంద్ర జీవితంలో మొట్టమొదటి చీకటిరాత్రి. గెలుపే కాని, ఓటమి తెలియని సురేంద్ర స్వప్న మాటల్ని భరించలేక పోతు న్నాడు.

"నేను జగన్నాథ్‌ని పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నాను."

సురేంద్రకు ముచ్చెమటలు పట్టాయి. నెల్లాళ్ళుగా స్వప్న ధోరణిలో అతని కేదో మార్పు కనబడుతోంది. జగన్నాథ్‌కూడా మరో హాకీ ఆటగాడు. అతనితో స్వప్న పరిచయం వృద్ధి పొందుతూందన్న విషయం సురేంద్రకు తెలుసు. కాని ఆ పరిచయం ఇలా మలుపు తిరుగుతుందని అతను ఊహించలేదు. తిరిగిందని తెల్సాక భరించలేక పోతున్నాడు.

"ఆడది రెండోసారి పెళ్ళి చేసుకోడం సాంప్రదాయ విరుద్ధం."

ఆమెను కన్విన్స్ చెయ్యడానికన్నాడు సురేంద్ర.

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకోడం కూడా సాంప్రదాయ విరుద్ధమే—"

స్వప్న అలా అంటుందనుకున్నాడు. అన్లేదు.

"సాంప్రదాయాలు పాటించని వాళ్ళు వాటిగురించి మాట్లాడ కూడదు" అంది.

"నే నీన్నికు ఏంలోటు చేశానని ఇలాటి నిర్ణయం తీసుకున్నావ్?" జాలిగా అడిగాడు సురేంద్ర.

"నెల్లాళ్ళక్రితం మనిద్దరం డాక్టర్ చంద్రకాంత్ దగ్గర కెళ్ళాం గుర్తుందా?

"అవును వెళ్ళాం."

"మనిద్దర్నీ ఎగ్జామిన్ చేశాడు గుర్తుందా?"

"అవును చేసాడు."

"తర్వాత నాకు చెప్పాడు. నువ్వు బాధపడతావని నీకు చెప్పలేదు. నేను నీవల్ల తల్లిని కాలేను."

సురేంద్రకు ఎవరో తన తెలివి తేటల్ని వెక్కిరిస్తున్నట్టని పించింది.

"జీవితంలో ప్రతి ఆడది తల్లి కావాలని కోరుకుంటుంది. ఆఖరికి ముష్టిది, కుష్ఠుదికూడా .... నాక్కూడా ఆ కోర్కె ఉండటం తప్పు లేదుగా.... నేను తల్లినికావాలి. నీవల్ల కాలేనని డాక్టర్ ఖచ్చితంగా చెప్పే సాడు. అంతే కాని, నీమీద ఇష్టంలేక కాదు —జగన్నాథ్ మీద మోజు తోనూ కాదు—"

సురేంద్ర ఏడవడం, బతిమాలడం మినహా ఏం చెయ్యాలేక పోతున్నాడు.

చివర్న స్వప్నే అంది.

"నేను సంసారసుఖానికి పనికిరానని కోర్టులో విడాకులకి అప్లయి చెయ్యి. నేను దాన్ని ప్రతిఘటించను. కోర్టువారు యీజీగా విడాకు లిస్తారు.....వెంటనే జగన్నాథ్‌ని పెళ్లి చేసుకుంటాను."

సురేంద్ర ఇంకా ఇంకా ఏడుస్తున్నాడు.

మొట్టమొదటిసారిగా తన ఫౌల్‌ని ఎత్తిచూపి మరొకళ్ళు పెనాల్టీ కార్నర్ తీసుకుని అతన్ని గోల్లోకి కొట్టారు.

గోల్లోకి వెడుతున్న హాకీబంతిలా అతను గజగజవణికిపోతున్నాడు



(స్వాతి 1978)